


**ఏకగ్రీవాల కోసం**

**ప్రధాన పార్టీల ప్రయత్నాలు..**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 2 సంచిక - 227 ఆదివారం 30 నవంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ‘ఆపరేషన్ సాగర్ బంధు’..

**శ్రీలంకకు 12 టన్నుల సహాయ సామగ్రిని పంపిన భారత్**

**దిత్వా తుపాన్ బాధితుల కోసం శ్రీలంకకు భారత్ భారీ సాయం**

**వాయుసేన విమానంలో 12 టన్నుల సహాయ సామగ్రి తరలింపు**

**ఇప్పటికే నౌకల ద్వారా రేషన్, నిత్యావసరాల పంపిణీ**




హైదరాబాద్**నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
దిత్వా తుపాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన పొరుగు దేశం శ్రీలంకకు భారత్ తన సహాయ సహకారాలను విస్తరించింది. ‘ఆపరేషన్ సాగర్ బంధు’లో భాగంగా భారత వాయుసేనకు చెందిన సీ-130జే విమానం శనివారం సుమారు 12 టన్నుల సహాయ సామగ్రితో కొలంబోలో ల్యాండ్ అయింది. మిగతా 2లో...

# కాంగ్రెస్ అధిష్టానం ఆదేశంతో సిద్దుతో డికె భేటీ

**కర్నాటకలో మళ్లీ రాజకీయ సెగ**

**ఇరువురు నేతలు బ్రేక్‌ఫాస్ట్ చర్చలు**

**2028లో గెలుపు కోసం చర్చించామని వెల్లడి**



బెంగళూరు,**నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
కర్ణాటక సీఎం కుర్చీ కోసం సమరం వేళ కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు శనివారం బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు ఒక్కచోట కలిశారు. ఇక్కడ ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదిర్చేందుకు కాంగ్రెస్ నానా తంటాలు పడుతోంది. ఎట్టకేలకు కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య,మిగతా 2లో...

# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

**స్టోరేజీకి అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ**

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్**

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**



హైదరాబాద్,**నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
గ్రీన్ ఎనర్జీ.. దేశ, ఆయా రాష్ట్రాల అభివృద్ధికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ అనే చర్చ జరుగుతుందని అన్నారు. పారిస్ లో జరిగిన మిగతా 2లో...

# తెలంగాణను కాపాడేది గులాబీ జెండా కేసీఆర్ గళమే

**మూడు తరాలను ముంచిన కాంగ్రెస్**

**తెలంగాణకు శాశ్వత శత్రువు ఆ పార్టీయే**

**ఢిల్లీ తోలుబొమ్మలు, గుజరాత్ కీలుబొమ్మలతో ప్రమాదం**

**: దీక్షా దివస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**





హైదరాబాద్**నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
తమ పార్టీ అధినేత కేసీఆర్ 2009లో చేసిన దీక్ష గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ఆనాడు ఆ ఉద్యమంలో ఎక్కడున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మూడు తరాలను ముంచిన కాంగ్రెస్ పార్టీయే తెలంగాణకు శాశ్వత శతృవు అని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం, ప్రొఫెసర్ జయశంకర్, అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షకు వ్యతిరేకంగా ఈ ప్రాంతాన్ని బలవంతంగా ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలి దశ తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసి, ఉద్యమకారులను కాల్చి చంపిందని వాపోయారు. మిగతాది 2లో...




# ముగిసిన మొదటి విడత నామినేషన్లు

**తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు..**

**మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్ల స్వీకరణ**

**వచ్చే నెల 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు**



# వేగంగా మామునూరు విమానాశ్రయ నిర్మాణం

**ముందుగా ఏటీఆర్ విమానాలు నడుపుతాం**

**చురుకుగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు**

**అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరు**

**వరంగల్ పర్యటనలో మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

హన్మకొండ,**నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):** వరంగల్ విమానాశ్రయం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడి నుంచి ముందుగా మిగతాది 2లో...

# ముగిసిన ఐ-బొమ్మ రవి రెండో విడత కస్టడీ



**ఐ-బొమ్మ, బప్పం పేర్లు ఎందుకు పెట్టాడో చెప్పిన ఐబొమ్మ రవి!**

**ఐ-బొమ్మ పూర్తి పేరు ఇంటర్నెట్ బొమ్మ అని వెల్లడి**

**సాంకేతిక సమస్య కారణంగా బలపం పేరునే బప్పంగా పెట్టినట్లు వెల్లడి**

హైదరాబాద్,**నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
పైరసీ వెబ్‌సైట్లు ‘ఐబొమ్మ’, ‘బప్పం’ల పేర్లు ఎందుకు పెట్టారనే విషయాన్ని ఐ-బొమ్మ రవి విచారణలో వెల్లడించాడు. ఐ-బొమ్మ రవిని అరెస్టు చేసిన పోలీసులు మొదట ఐదు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించారు. ఈ కేసులో మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి అతడిని మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా, నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం అంగీకరించింది. మిగతా 2లో...

# రేపటి నుంచి పార్లమెంట్




న్యూఢిల్లీ **నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
పార్లమెంటు శీతాకాల సమావేశాలు రేపటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19 వరకు జరిగే ఈ సమావేశాల్లో పది బిల్లులను ఆమోదించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం జాబితా చేసింది. మొత్తం 19 రోజులు సాగే ఈ సమావేశాల్లో 15 రోజులు ఉభయసభలు భేటీ కానున్నాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది.

# దూసుకొస్తున్న దిత్వా తుపాన్

**మూడురోజుల్లో భారీనుంచి అతి భారీ వర్షాలు**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన విపత్తుల నిర్వహణ సంస్థ**




అమరావతి:**నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
దిత్వా తుఫాను ఆంధ్రప్రదేశ్ వైపునకు దూసుకుని వస్తోంది. దీంతో పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేశారు. నైరుతి బంగాళాఖాతం ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో దిత్వా తుఫాను ప్రభావం కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. మిగతా 2లో...

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా నేవీ డే ‘సర్గమ్ 2025’


**- నేవీ డే సన్నాహక కార్యక్రమాల్లో అలరించిన నేవీ బ్యాండ్**




విశాఖపట్నం**నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
డిసెంబర్ 4వ తేదీన జరగబోయే నేవీ డే ఉత్సవాలకు ముందస్తుగా తూర్పు ప్రాంత నావికాదళ కమాండ్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన సర్గం 2025 - ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రిపవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శనివారం సాయంత్రం సముద్రిక ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. మిగతా 2లో...

# రెండు కార్లు ఢీ 5 మంది మృత్యువాత

- కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృతి
- మంత్రాలయం దర్శనం కోసం వస్తుండగా ఘటన
- మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు





కర్నూలు,**నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
కర్నూలు జిల్లా పరిధిలో శనివారం ఉదయం రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఓ ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని ఐదుగురు కర్నాకట వాసులు దుర్మరణం చెందారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని కొటేకల్ గ్రామం వద్ద ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. మిగతా 2లో...



# రెండు కార్లు ఢీ

(మొదటి పేజి తరువాయి)

రెండు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు. కర్ణాటక నుంచి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం దర్శనం కోసం మంత్రాలయం వెళ్తుండగా.. కోటేకల్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వీరిని కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిక్కహోసల్లి గ్రామానికి చెందిన.. వెంకటేశప్ప(60), ఆయన కూతురు మీనాక్షి(32), అల్లుడు సతీశ్(36), మనవళ్లు రుత్విక్, బన్నీగౌడ్‌లుగా తేల్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బెంగళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న కర్ణాటక బస్సు పత్తికొండ పరిధిలోని తుగ్గలి, రాతన గ్రామాల మధ్య బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 29 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. వారిలో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

(మొదటి పేజి తరువాయి)

అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం తప్పకుండా గ్రీన్ ఎనర్జీ ఉండాలని అగ్రిమెంట్ చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంలో గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్‌తో తెలంగాణ ముందుకు పోతుందని భట్టి వెల్లడించారు. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తీర్చి దిద్దుతున్నామని, హైదరాబాద్ గ్లోబల్ హబ్ కాబోతోందని భట్టి తెలిపారు. 2047 వరకు మూడు ట్రిలియన్‌ల ఎకానమీకి చేరుకోవాలనేది లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు కావలసిన పెట్టుబడులకు అవసరమైనది విద్యుత్ అన్నారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ప్లానింగ్ చేస్తున్నాం.. పవర్ డిమాండ్ రాష్ట్రంలో పదేళ్లుగా పెరుగుతుందని తెలిపారు. తాజాగా ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. 2014 నుంచి విద్యుత్తు 14.2 డిమాండ్ గ్రోత్ ఉందన్నారు.. 2020- 2021 నుంచి 5.44 గ్రోత్, 2024- 25లో 9.8 శాతం గ్రోత్ కనిపించిందని వెల్లడించారు. 2025 నుంచి 34, 35 వరకు తెలంగాణలో 6.4 గ్రోత్ ఉండే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మూసి ప్రక్షాళన.. ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడుల ఒప్పందం.. పరిశ్రమలు.. డేటా సెంటర్లతో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారబోతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 8.50 గ్రోత్ ఉండబోతుంది.. 2047 కి లక్ష 39 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం.. తెలంగాణలో 2026 ఏప్రిల్ నాటికి 24769 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంది.. వాడే విద్యుత్తులో 50 శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలి.. ఎనర్జీ స్టోరేజ్ ప్లాన్ గతంలో లేదు.. పదేళ్ల క్రితం ప్లాన్ చేసుకుని ఉంటే బాగుండేది.. అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ స్టోరేజ్ ప్లానింగ్ లేదు.. గ్రీన్ పవర్ ఎనర్జీ స్టోరేజ్‌కి తెలంగాణ అనుకూలం.. పదేళ్లుగా ఇలాంటి ప్రయత్నాలు చేయలేదు.. కానీ ఏపీ మొదలుపెట్టింది.. తెలంగాణలో మాత్రం ఆ ప్రయత్నమే లేదు.. థర్మల్ పవర్ కంటే.. గ్రీన్ ఎనర్జీ వస్తుంది.. కానీ తెలంగాణ అందుకోలేక పోయింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత.. డిలైట్ లాంటి వాళ్ళను నివేదిక ఇవ్వండి అని అడిగాం.. ఒక్కరోజు బ్లాక్ ఔట్ అయితే 1500 నుండి 2000 కోట్లు నష్టపోతం.. అని వెల్లడించారు.

# దూసుకొస్తున్న దిత్వా తుపాన్

(మొదటి పేజి తరువాయి)

ప్రస్తుతానికి ఇది కారైకాల్‌కి 150 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 280 కిలోమీటర్లు, చెన్నైకి 350 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం అయిందని వెల్లడించారు. గడిచిన 6 గంటల్లో 8 కిలోమీటర్ల వేగంతో తుఫాను కదులుతుందని వివరించారు. ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న తుఫాను చెన్నైకి అతి సమీపానికి వస్తుందని వివరించారు. ఈరోజు రాత్రికి తుపాను 60కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని చెప్పుకొచ్చారు. తీరానికి సమాంతరంగా ప్రయాణిస్తూ ఆయా ప్రాంతాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. మూడు రోజుల్లో ఏపీలో కొన్నిచోట్ల భారీ, మరికొన్ని చోట్ల అతి భారీ, ఇంకొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రెండు రోజుల వరకు తుఫాను తీరం దాటే పరిస్థితి లేదని అన్నారు. తీరం దాటకుండానే తుఫాను క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఆదివారం తెల్లవారుజామునకు తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. తుఫాను ప్రభావంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. తుఫాను ప్రభావం దృష్ట్యా మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరిగి రావాలని కోరారు. మూడు రోజులపాటు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు.

# ‘ఆపరేషన్ సాగర్ బంధు’..

(మొదటి పేజి తరువాయి)

ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. “ఆపరేషన్ సాగర్ బంధు కొనసాగుతోంది. టెంట్లు, టార్పాలిన్లు, దుప్పట్లు, పరిశుభ్రత కిట్లు, తినడానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలతో కూడిన 12 టన్నుల సామగ్రి కొలంబో చేరింది” అని ఆయన తెలిపారు. నిన్న కూడా భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ ఉదయగిరి నౌకల ద్వారా శ్రీలంకకు అత్యవసర సహాయాన్ని అందించారు. ఈ నౌకల ద్వారా 4.5 టన్నుల పొడి రేషన్, 2 టన్నుల తాజా రేషన్‌తో పాటు ఇతర నిత్యావసరాలను బాధితులకు పంపిణీ చేసినట్లు కొలంబోలోని భారత హైకమిషన్ పేర్కొంది. దిత్వా తుపాన్ వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. “మా సమీప సముద్ర పొరుగు దేశానికి సంఘీభావంగా అత్యవసర సహాయ సామగ్రిని పంపాము. అవసరమైతే మరింత సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నాం. ‘నైబర్‌హుడ్ ఫస్ట్’ పాలసీకి కట్టుబడి కష్టకాలంలో శ్రీలంకకు అండగా నిలుస్తాం” అని ఆయన స్పష్టం చేశారు

# ముగిసిన ఐ-బొమ్మ రవి రెండో విడత కస్టడీ

(మొదటి పేజి తరువాయి)

అతడి రెండో విడత కస్టడీముగిసింది. పోలీసుల విచారణలో అతడు పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ఐ-బొమ్మ పూర్తి పేరు ఇంటర్నెట్ బొమ్మ అని తెలిపాడు. విశాఖలో సినిమాను బొమ్మ అని పిలిచేవారని అందుకే ఆ పేరు పెట్టినట్లు చెప్పాడు. మరో పైరసీ వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలనుకున్నప్పటికీ, డొమైన్‌లో సాంకేతిక సమస్య కారణంగా ‘ఎల్’ అక్షరాన్ని తొలగించి ‘బప్పం’గా మార్చినట్లు వెల్లడించాడు. ఐ-బొమ్మ రవి రెండో విడత కస్టడీ ఈరోజుతో ముగిసింది. ఇందులో భాగంగా పోలీసులు అతడిని మూడు రోజుల పాటు ప్రశ్నించి, కీలక విషయాలను రాబట్టారు. పైరసీకి సంబంధించిన అడ్వాన్స్‌డ్ సాంకేతికత గురించి పోలీసులకు రవి వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాలు టెలిగ్రామ్ నుండి తీసుకున్నవేనని చెప్పాడు. కస్టడీ ముగియడంతో పోలీసులు అతడిని కోర్టులో హాజరుపరిచారు.

# కాంగ్రెస్ అధిష్టానం ఆదేశంతో సిద్దుతో డికె భేటీ

(మొదటి పేజి తరువాయి)

ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య శనివారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ జరిగింది. దీనికి సంబంధించి డీకే శివకుమార్ ఎక్స్‌లో పోస్ట్ కూడా చేశారు. ఉదయం బెంగళూరులోని కావేరి నివాసంలో అల్పాహార సమావేశం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిశానని డీకే చెప్పారు. కర్ణాటక ప్రాధాన్యతలు, ముందుకు సాగాల్సిన మార్గాలపై ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించారు. అయితే, డీకే శివకుమార్ తన ఎక్స్ సందేశంలో తెలుపనప్పటికీ సీఎం సిద్ధరామయ్యతో టీపార్టీ మీటింగ్ ముఖ్యంగా రొటేషనల్ సీఎం ఒప్పందంపై చర్చించుకునేందుకే నన్నది అందరికీ తెలిసిన విషయమే. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకే ఇరువురు నేతలు టీపార్టీ మీటింగ్ పేరిట కలుసుకుని మాట్లాడుకున్నట్టు సమాచారం. ఇలా ఉండగా, 2023లో కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎవరు రాష్ట్రానికి సీఎం కావాలన్న ప్రశ్న ఉదయించింది. అయితే, అధిష్టానం సూచన మేరకు ఇరువురు నేతలు రొటేషనల్ ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రిగా వ్యవహరించలన్న ఒప్పందం జరిగింది. దీంతో సిద్దారామయ్య సిఎంగా, శివకుమార్ డిప్యూటీగా నియమితులయ్యారు. ఇప్పుడు, ఆయా కాలం పూర్తయ్యే సమయంలో, ఈ ఒప్పందం మళ్లీ తెరమీదకి వచ్చింది. ప్రజల ఎన్నికల తీర్పు ప్రకారం 2028 వరకు పూర్తి కాలంపాటు సీఎంగా వ్యవహరిస్తానని సీఎం సిద్ధరామయ్య పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. అయితే, అదే సమయంలో పార్టీ హై కమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పుకొస్తున్నారు. దీంతో ఈ ఇప్పుడు ఈ అంశం మీద అందరి దృష్టి పడింది. మరోవైపు, ఢిల్లీలో సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలతో స్ట్రాటజీ గ్రూప్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఇరువురు నేతలు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సమావేశంలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయం కర్నాటక రాజకీయాల్ని కొత్త మలుపు తిప్పవచ్చు. దీంతో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కెసి వేణుగోపాలు ఆదేశంతో తాము ఇద్దరం భేటీ అయ్యామని డిప్యూటి సిఎం డికె శివకుమార్ చెప్పారు. తాము 2028 ఎన్నికల గురించి చర్చించామని సిఎం సిద్దరమాయ్య అన్నారు. ఈ భేటీ అనంతరం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు తాము బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నామని.. కానీ ఏ విషయం పైనా చర్చించలేదని తెలిపారు. నెల రోజుల ముందు నుంచి అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని సిద్ధరామయ్య దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తాను, డీకే ఉమ్మడిగా ఎదుర్కొంటామని అన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. 2028లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కర్ణాటక ప్రజల మద్దతుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. వారికిచ్చిన వాగ్దానం ప్రకారం తాను సిద్దరామయ్యతో కలిసి పని చేస్తానని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. తాము పార్టీకి విశ్వాసపాత్రులైన సైనికుల్లా పని చేస్తున్నామని.. హైకమాండ్ ఏం చెప్పినా.. దానిని అందరం అనుసరిస్తామని స్పష్టంచేశారు. ప్రస్తుతం పార్టీ పలు సమస్యలు ఎదుర్కొం టోందని.. 2028లో రానున్న కర్ణాటక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళు న్నామన్నారు. నాయకత్వం విషయంలోనూ హైకమాండ్ నిర్ణయమే ÷నైల్ అని పేర్కొన్నారు. సీఎం సిద్ధరామయ్యతో జరిగిన భేటీలో రాబోయే అసెంబ్లీ సమావేశం సహా పలు విషయాలపై చర్చలు జరిపినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. రెండున్నరేళ్ల తర్వాత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించేలా అప్పట్లో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది. పార్టీ దీనిని పదే పదే ఖండిస్తున్నా.. ఈ అంశం రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ హైకమాండ్ సూచనల మేరకు సిద్ధూ, డీకే నేడు ఒక్కచోట సమావేశమయ్యారు.

# ముగిసిన మొదటి విడత నామినేషన్లు

**తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు..**

**మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్ల స్వీకరణ**

**వచ్చే నెల 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు**

హైదరాబాద్,**నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల మొదటి దశకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ గడువు ఈరోజు సాయంత్రంతో ముగిసింది. మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలకు, 37,440 వార్డులకు నామినేషన్లు స్వీకరించారు. ఆదివారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని, అదే రోజు చెల్లుబాటు అయిన నామినేషన్ల వివరాలు వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. సోమవారం అప్పీలు స్వీకరణ, డిసెంబర్ 2న అప్పీళ్ల పరిష్కారం ఉంటుందని పేర్కొన్నారు.
డిసెంబర్ 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తారు. వచ్చే నెల 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉపసర్పంచ్ ఎన్నిక జరుగుతాయని అధికారులు తెలిపారు. రేపటి నుండి డిసెంబర్ 2 వరకు రెండవ విడత ఎన్నికల నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండవ విడతలో 193 మండలాల్లోని 4,333 పంచాయతీలకు, 38,350 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.
ఇదిలా ఉండగా, వికారాబాద్ తాండూరు మండలంలో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియ రాత్రి 7 గంటలు దాటినా కొనసాగింది. పదుల సంఖ్యలో అభ్యర్థులు ఉండటంతో రాత్రి 9 గంటల వరకు ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల గడువు ముగిసింది. ఆ సమయానికి క్యూలో ఉన్న అభ్యర్థులకు టోకెన్లు జారీ చేసి నామినేషన్ పత్రాల దాఖలుకు అనుమతిస్తున్నారు.

# తెలంగాణను కాపాడేది గులాబీ జెండా కేసీఆర్ గళమే

(మొదటి పేజి తరువాయి)

.

ఆ తర్వాత గెలిచిన తెలంగాణ ప్రజా సమితి 11 మంది ఎంపీలను కాంగ్రెస్‌లో కలుపుకుని తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను చంపేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. అనంతరం మలి దశ ఉద్యమంలోనూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నీరుగార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఎజెండాగా 2004లో బీఆర్ఎస్ (నాడు టీఆర్ఎస్) నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను ఫిరాయింపులకు ప్రోత్సహించిందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించకుండా నాడు రాష్ట్రంలో, కేంద్రంలో ఉన్న ఆ పార్టీ నిర్లక్ష్యం చేస్తుండటంతో విశ్వాసానికి విశ్వరూపం, మొండి, జగమొండి అయిన కేసీఆర్ 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారని తెలిపారు. దీంతో ఆ ఏడాది డిసెంబర్ 9న నాటి కేంద్ర హొంశాఖ మంత్రి చిదంబరం పార్లమెంటులో తెలంగాణ రాష్ట్ర ప్రక్రియపై ప్రకటన చేశారని వివరించారు.
కేసీఆర్ దొంగదీక్ష చేశారంటూ ఏనాడు తెలంగాణ ఉద్యమంలో లేని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చేసింది దొంగ దీక్షే అయితే నాడు ఆ దీక్షను విరమించాలంటూ పార్లమెంటు సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వంలోని హొం మంత్రి చిదంబరం ఎందుకు విజ్ఞప్తి చేశారని ఆయన ప్రశ్నించారు. తొలి దశ ఉద్యమంలో తొలి శత్రువుగా మారిన కాంగ్రెస్ తెలంగాణకు శాశ్వత శత్రువుగా ఉన్నదని చెప్పారు. ఢిల్లీ తోలుబొమ్మలు, గుజరాత్ కీలుబొమ్మలు, ఢిల్లీకి కప్పం కడుతూ సామంతులుగా ఉన్న వారితో ఎప్పటికైనా రాష్ట్రానికి ప్రమాదమని కాంగ్రెస్, బీజేపీలను ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణను కాపాడేది గులాబీ జెండా, కేసీఆర్ గళమే అని స్పష్టం చేశారు. యువతరం ఏడుతరాల చరిత్ర తెలుసుకోవాలనీ, లేకపోతే విలన్లే హీరోలుగా తప్పుదోవ పట్టిస్తారని తెలిపారు.
సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి, మళ్లీ పోటీ చేయించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. ఫిరాయింపులను ప్రోత్సహించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని దుయ్యబట్టారు. ఉద్యమంలో పట్టువిడుపులతో ముందుకు సాగిన కేసీఆర్ చాణక్యం వల్లనే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని, ఇందులో భాగంగా ఎన్నో పదవీ త్యాగాలు, ఎన్నో రాజీనామాలు ఉన్నాయని గుర్తుచేశారు. తెలంగాణ సోయి లేని పార్టీలతో ఏనాటికైనా ప్రమాదమే అని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఫీనిక్స్ పక్షిలా మళ్లీ తిరిగి లేస్తుందని అన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా నేవీ డే ‘సర్గమ్ 2025’

(మొదటి పేజి తరువాయి)

ఈ కార్యక్రమానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్ కి విశాఖపట్నం విమానాశ్రయంలో నేవల్ ఆఫీసర్లు రజనీష్ శర్మ, కిషోర్, శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, వంశీ కృష్ణ యాదవ్, సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా ఈస్టర్న్ నావల్ కమాండ్ లోని శౌర్య అతిథి గృహం చేరుకున్నారు. ఉప ముఖ్యమంత్రివర్యులతో విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సమావేశమయ్యారు. అనంతరం పవన్ కళ్యాణ్ సముద్రిక చేరుకున్నారు. చీఫ్ అడ్మిరల్ సంజయ్ భల్లా, ఆయన సతీమణి ప్రియా భల్లా స్వాగతం పలికారు. అలరించిన నేవీ బ్యాండ్‌సర్గం 2025లో భాగంగా తూర్పు ప్రాంత నావికాదళ సింఫనీక్ బ్యాండ్ లయబద్ధంగా చేసిన సంగీత విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మ్యూజిక్ కంపోజర్, ఈస్టన్ నావెల్ కమాండ్ బ్యాండ్ డైరెక్టర్ సతీష్



ఛాంపియన్, ఈస్టన్ నావెల్ బ్యాండ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ లు లయబద్ధంగా సంగీతానికి దర్శకత్వం వహించగా, దేశభక్తి గీతాలు, హిందీ పాటలతో పాటు ఎన్విరాన్మెంట్ సంబంధిత అంశాలపై కూడా ఈస్టన్ నేవీ బ్యాండ్ చేసిన సంగీతం అందరిని ఆకట్టుకుంది. సుమారు గంటకు పైగా చేసిన ఈ సంగీత విన్యాసాలు అందరిని సమ్మోహితం చేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా లయన్ కింగ్ మ్యూజిక్ మెమొంటోను శరత్ కుమార్ సింగ్ బాబుకి అందజేశారు. తూర్పు ప్రాంత నావికాదళ



కమాండ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా చేతుల మీదుగా ముఖ్యఅతిథి పవన్ కళ్యాణ్ టోకెన్ ఆఫ్ రెమెంబెన్స్

# వేగంగా మామునూరు విమానాశ్రయ నిర్మాణం

(మొదటి పేజి తరువాయి)

ఏటీఆర్ విమానాలు నడపాలని భావిస్తున్నట్లు తెలిపారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శనివారం వరంగల్‌లో పర్యటించారు. పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత పౌరుల స్పందన బట్టి మరిన్ని సర్వీసులు నడుపుతాం అన్నారు.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరయ్యాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పామని అన్నారు. హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరుద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చింది. రామప్ప ఆలయం అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు ఖర్చు చేస్తోందని కిషన్‌రెడ్డి వివరించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్‌కి చిత్తశుద్ధి లేదని కిషన్‌రెడ్డి విమర్శలు చేశారు. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని



ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్‌దే పూర్తి బాధ్యత అని.. ఈ విషయంలో ఆ పార్టీది కపటనాటకమని ఎద్దేవా చేశారు. బీజేపీకి ప్రధాన శత్రువు కాంగ్రెస్ మాత్రమే అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతికత లేదని ఆక్షేపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు బీసీలకే కేటాయిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహించాయని మండిపడ్డారు. బీసీలకు ఇచ్చే సీట్లలో ముస్లింలు పోటీచేసే అవకాశం ఉందని.. ఇది బీసీలకు అన్యాయం చేసినట్లు కాదా...? అని ప్రశ్నించారు. మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని స్పష్టం చేశారు కిషన్‌రెడ్డి.
మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన భూసేకరణ చివరి దశలో ఉందని చెప్పుకొచ్చారు. ఎయిర్‌పోర్ట్ విషయంపై కొంతమంది రైతులు కోర్టుకెళ్లారని.. తాము చట్టపరంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ విషయంపై ఎయిర్‌లైన్స్ కంపెనీలతో తాము మాట్లాడుతున్నామని వివరించారు. ఎయిర్‌పోర్ట్‌లు కట్టడమే కేంద్రం బాధ్యత అని.. విమానాలు నడిపేది ప్రైవేటు కంపెనీలేనని తెలిపారు. హైదరాబాద్ నుంచి పరిశ్రమలు పోతే మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడతారని.. ఈ విషయంపై తాము పోరాడుతున్నామని చెప్పుకొచ్చారు. పరిశ్రమలపై సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీసీపీ




**రాయపర్తి/నవంబర్ 29(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలంలోని సన్నూరు, ఊకల్,కొత్తూరు పెరికేడు,రాగన్నగూడెం,మైలారం,రాయపర్తి,మొరిపిరాల,కాట్రపల్లి,కొండూరు,కొలను పల్లి,కేశపురం,తిర్మలాయ పల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను శనివారం జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్,వర్ధన్నపేట ఏసిపి అంబటి నర్సయ్య తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుకోవాలని అన్నారు.మండలంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐ, ఎస్ఐ లు పాల్గొన్నారు.

# యువ నాయకులకు భారతీయ జనతా పార్టీ పెద్దపీట
## :రాణా ప్రతాప్ రెడ్డి



**నర్సంపేట నవంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట నియోజకవర్గం,నల్లబెల్లి మండలం, బొల్లోనిపల్లి గ్రామానికి చెందిన భూమా నరేష్ బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు తడుక వినయ్ అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు.ఈ సందర్బంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమని గ్రహించి బిజెపి పార్టీలో చేరుతున్నారన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల్లో యువకులకు ఎక్కువ ప్రాధ్యానత కల్పిస్తూ,వారిని ప్రజా ప్రతినిధులను చేస్తానని అన్నారు.స్థానిక ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామ అభివృద్ధి సాధ్యమైతుందన్నారు.స్థానిక ఎన్నికల్లో నిలబడుతున్న అభ్యర్థుల గెలుపుకై సైనికుల్లా ప్రతి కార్యకర్త పని చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్,జిల్లా నాయకులు పెరుమాండ్ల కోటి,సీనియర్ నాయకులు కొండ్లె రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఎస్ టి బృందం ఆంధ్ర తెలంగాణ,అప్రమత్తం గా ఉండాలి



**వైరా/నవంబర్2(జర్నలిస్ట్ వార్త):** ఆంధ్ర తెలంగాణ సరిహద్దు పోస్టుల వద్ద దాసాపురం గన్నవరం గ్రామాలకు వెళ్లే కోడలిలోవైరా ఎస్సై 2పవన్ శనివారం డివిజన్‌లోని ఎస్ఎస్టీ తనిఖీ కేంద్రాన్ని సందర్శించి బృందం పనితీరును పరిశీలించారు. వాహనాల తనిఖీల విధానం, సిబ్బంది బాధ్యతల పంపిణీ, వీడియో చిత్రీకరణతో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తున్న తీరు గురించి అధికారులు సమీక్ష నిర్వహించారు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి తనిఖీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, ఎన్నికలకు సంబంధించి ఏ రకమైన ఉల్లంఘన జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్టీ బృందానికి సూచించారు. ప్రతిక్షణం అప్రమత్తం గా ఉండలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వసంత్, కానిస్టేబుల్ హుస్సేన్, వీఆర్ఏలు ఉన్నారు

# న్యూ డెమోక్రసీ పార్టీకి మాజీ సర్పంచ్ ఎల్లబోయిన కవిత రాజీనామా



**బయ్యారం/నవంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండలంలోని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ మాజీ సర్పంచ్ ఎల్లబోయిన కవిత,కృష్ణ దంపతులు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ వల్ల మా కుటుంబం అనేక ఆర్థిక నష్టాలకు గురి అయ్యామని,2013 సం,,లో బయ్యారం సర్పంచ్ గా పోటి చేసి న్యూడెమోక్రసీ పార్టీ నుంచి గెలుపొందినట్లు తెలిపారు.పార్టీ అభివృద్ధికి కృషి చేశామని,ప్రశాంతంగా జీవనం సాగిస్తున్న మాకు సర్పంచ్ అభ్యర్థిగా జగ్గుతండ నుంచి బరిలోకి నిలిచేందుకు రమ్మని పిలిచి,ఇప్పుడు మాట మార్చి సర్పంచ్ అభ్యర్థికి వేరే అభ్యర్థిని సూచించామని న్యూ డెమోక్రసీ నాయకులు తెలిపారని ఇలా చెయ్యడం మమ్మల్ని తీవ్రంగా బాధించిందని దాని కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు.తదుపరి ఏ పార్టీలో చేరేది ఆలోచించి తగు నిర్ణయం చేసి ప్రకటిస్తామని తమ అభిప్రాయాన్ని మీడియాకు తెలిపారు.కష్టపడి పనిచేసే వారికి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీలో స్థానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# మల్లవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ బరిలో దాసరి శ్రీనివాస్..



**తల్లాడ/నవంబర్29(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని మల్లవరం గ్రామపంచాయతీ సర్పంచ్ బరిలో , సామాజిక సేవకులు దాసరి శ్రీనివాసరావు ఉండనున్నారు. గత రెండు దశాబ్దాలు పైగా జర్నలిస్టు వృత్తిలో ఉంటూ తనదైన శైలిలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పటినుండి క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. గ్రామంలో కరోనా కష్టకాలంలో సైతం ఎంతోమందిని కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాలు చేర్పించి గ్రామంలో పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, మాలోతు రామదాసు నాయక్ తో పాటు రాష్ట్ర మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తదితర పెద్ద నాయకులతో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మల్లారం గ్రామపంచాయతీ జనరల్ కు కేటాయించడంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయన పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. గ్రామంలో అందరి నాయకులతో సంబంధాలు కలిగి ఉండి నిరంతరం ప్రజల సమస్యలను వెలికి తీసి అభివృద్ధికి పాటుపడుతున్నాడు. ఈసారి జరిగే ఎన్నికల్లో సర్పంచ్ గా పోటీ చేస్తానని ప్రకటించారు. ప్రజలందరూ తనను గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. భారీ ఎత్తున నామినేషన్ కు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నానని, ప్రజలందరూ ఆశీర్వదించి గెలిపించాలని దాసరి శ్రీనివాస్ కోరారు.

# మొరిపిరాల సర్పంచ్ గా పెద్దగొని నాగరాజు



**రాయపర్తి/నవంబర్ 29(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మొరిపిరాల గ్రామ సర్పంచ్ గా పెద్దగోని నాగరాజు ని గ్రామస్తులంతా కలిసి పార్టీలకు అతీతంగా శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నాగరాజు గ్రామ పంచాయితీ కారొబార్ విధులు నిర్వహిస్తూ గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.తన ఎన్నికకు సహకరించిన గ్రామ ప్రజలకు,రాజకీయ నాయకులకు,కుల సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామ పార్టీ నాయకుల నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక : ఎమ్మెల్యే దొంతి






**నర్సంపేట/నవంబర్29 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట,ఖానాపురం మండలాలలో ఏర్పాటుచేసిన మండల స్థాయి సర్పంచ్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని అన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల అభ్యర్థుల ఎంపికను గ్రామ పెద్దలు,స్థానిక నాయకులు కలిసి చర్చించి ఖరారు చేయాలి.ఎక్కువ మంది పోటీదారులు ఉన్నా,అందరినీ కూర్చోబెట్టి గ్రామాభివృద్ధి సామర్థ్యం,ప్రజల ఆశీస్సులు, రిజర్వేషన్‌లను పరిగణలోకి తీసుకుని ఉత్తమ అభ్యర్థిని సర్పంచ్‌గా ఖరారు చేయండి. గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయం కొరకు మండలాల వారీగా ఇంచార్జీలను కూడా నియమించామని,అందరూ సమిష్టిగా ఉండి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# కేసీఆర్ దీక్ష దివాస్ నవంబర్ 29

## తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టిన చారిత్రక దినం నవంబర్ 29

### బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి




**నర్సంపేట/నవంబర్29 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టిన చారిత్రక దినం నవంబర్ 29
అని బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం
పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో. కేసీఆర్ సచ్చుడో" అనే నినదించి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, ఉద్యమ నాయకుడు కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన రోజు ఇది. తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన ఒక అపూర్వ ఘట్టం, యావత్ తెలంగాణ ప్రజలని, తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాలను ఏకం చేసిన దీక్ష తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్ష దివస్ నిలుస్తుంది. 2009 నవంబర్ 29వ తేదీన భారత రాష్ట్ర సమితి (అప్పటి టీఆర్ఎస్) అధ్యక్షులు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి, స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేసింది.
దీక్షకు వెళ్లే ముందు "తెలంగాణ వచ్చుడో – కేసీఆర్ సచ్చుడో" అనే తెగింపుతో చేపట్టిన ఈ దీక్ష సబ్బండ వర్గాల తెలంగాణ ప్రజలను ఏకం చేసింది. సమగ్ర భారత దేశ రాజకీయ వ్యవస్థను కదిలించి, దశాబ్దాల తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చింది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, మెప్పించి.. కులాలకు, మతాలకు అతీతంగా అందరినీ కలిపిన సందర్భం దీక్షా దివస్
ప్రత్యేక తెలంగాణ కళ కలగానే మిగిలిపోతుందేమో అన్న సమయంలో, అమరవీరుల నెత్తురుతో వారి త్యాగాలతో తెలంగాణ నేల తడిసి ముద్దవుతున్న సమయంలో ఎత్తిన జెండా విడవకుండా, పదవులను గడ్డి పోచాల్లా విసురుతూ తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర నినాదం ఇంకా బలంగానే ఉందని అనేకసార్లు నిరూపించి త్యాగాలకు త్రొవ్వచూపిన తీరు చరిత్ర పుటల్లో పదిలం
ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్,పట్టణ పార్టీ అధ్యక్షులు,మాజీ ఎంపీపీ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్,జిల్లా నాయకులు, మాజీ కాన్సిలర్లు,పట్టణ కమిటీ బాధ్యులు,అనుబంధ సంఘాల నాయకులు,యూత్ నాయకులు,మహిళా అధ్యక్షురాలు,మహిళా కమిటీ బాధ్యులు,అన్ని అనుబంధ సంఘాల నాయకులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# గరికపాడు కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా శీలం నాగమణి నామినేషన్ దాఖలు..

## శీలం సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ర్యాలీ..






**వైరా/నవంబర్29(జర్నలిస్ట్ వార్త):** వైరా మండలంలోని గరికపాడు గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా శీలం నాగమణి నామినేషన్ దాఖలు చేశారు. శనివారం గ్రామంలో అధికారులకు ఆమె నామినేషన్ పత్రాలను అందించారు. కాంగ్రెస్ పార్టీలో ఆమె భర్త సురేందర్ రెడ్డి సుదీర్ఘ కాలం పాటు సేవలందించారు. గతంలో అనేక పదవులను పొందిన ఆయన గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయనకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ నాయకులు తమ మద్దతు ప్రకటించారు. గరికపాడు గ్రామం నుంచి మంచి ప్రజాధారణ కలిగిన నాయకులుగా గుర్తింపు కలిగి ఉండటం గ్రామ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారు. గ్రామం సర్పంచిగా శీలం నాగమణి గెలిచే అవకాశాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాకంటి వెంకటస్వామి, తెల్లూరి భూషణం, సంగీతపు నరసింహారావు, నల్లటి రామారావు, సంగీత సైదులు, మాగంటి అప్పయ్య, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# ఏకగ్రీవాల కోసం ప్రధాన పార్టీల ప్రయత్నాలు..




**సత్తుపల్లి/నవంబర్29(జర్నలిస్ట్ వార్త):** గ్రామపంచాయతీ ఎన్నికలు నేపథ్యంలో ఖమ్మం జిల్లాలోని పలుచోట్ల గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు ప్రధాన పార్టీల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం బుజ్జగింపులు, నగదు, పదవి వంటి ఆశలు చూపుతూ పోటీ చేద్దాం అనుకునే వారిని తమ ఆలోచన, నిర్ణయం వెనక్కి తీసుకునేలా చేస్తున్నారు. ఇంకా పలు చోట్ల సర్పంచ్ పదవి కోసం వేలం పాటలు నిర్వహిస్తున్నారు. ఎవరు ఎక్కువ పాడితే వారికి సర్పంచ్ మరియు ఇతర పదవులు ఏకగ్రీవంగా ఇచ్చేందుకు ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. మరికొన్నిచోట్ల ప్రధానపార్టీలు సర్పంచ్ ఒకరికి అయితే ఉపసర్పంచి మరొకరికి అనే విధంగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే ఇలా చేయటం నిబంధనలకు విరుద్ధమని అధికారులు చెబుతున్నారు. ఎన్నిక అనేది ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని తెలియజేస్తున్నారు.

### సర్పంచ్,వార్డు సభ్యుల గుర్తుల కేటాయింపు...



| S. No. | Symbols in English and Telugu | Specimen Symbol |
|---|---|---|
| 1 | Ring ఉంగరము | |
| 2 | Scissors కత్తెర | |
| 3 | Bat బ్యాట్ | |
| 4 | Football ఫుట్ బాల్ | |

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులను కేటాయించింది. సర్పంచ్ అభ్యర్థులకు 20 గుర్తులు, వార్డు సభ్యులకు 15 గుర్తులను అధికారులు కేటాయించారు. సర్పంచ్ అభ్యర్థులకు బుట్ట, ఉంగరం, కత్తెర, కుట్టు మిషన్, బ్యాట్, క్యారెట్ వంటి గుర్తులను కేటాయించగా, వార్డు సభ్యులకు కరెంటు స్తంభం, గ్యాస్ పోయి, హార్మోనియం, ఇస్త్రీ పెట్టె, బీరువా వంటి గుర్తులను కేటాయించారు.

### ఎన్నికలవేళ మందుబాబులకు పండగే...!

గ్రామ ఎన్నికల రావడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మందుబాబుల డిమాండ్ పెరిగింది. నిత్యం కొంతమంది చీప్ లిక్కర్ తాగి జేబులు ఖాళీ చేసుకున్న వాళ్లు ఇప్పుడు కొత్త పాట పాడుతున్నారు. అది ఎలా అంటే, అన్నా ఆరోగ్యం బాగుండట్లేదు డాక్టర్ చీప్ లిక్కర్ తాగొద్దని అంటున్నారు. మరేంటి నేను చీప్ లిక్కర్ తాగత లేదన్న పలానా బ్రాండ్ మందు అయితే ఒకే అంటూ పరోక్షంగా కాస్ట్లీ ముందుకు టెండర్ పెడుతుండటంతో ఎన్నికల్లో పోటీ చేద్దామనుకునే పోటీ దారులు వీరి వ్యవహారం చూసి కంగు తింటున్నారు. నిన్నటి వరకు ఏదో ఒక బ్రాండ్ తాగిన వారు ఈ పంచాయతీ ఎలక్షన్ల పుణ్యమా అని టీచర్స్ బ్రాండ్, 100 పైపర్స్, బ్లెండర్స్ ప్రైడ్, వంటి కాస్ట్లీ బ్రాండ్లను డిమాండ్ చేస్తున్నారు. దీంతో పోటీ చేద్దామనుకున్న అభ్యర్థులు వీరి డిమాండ్ చూసి అవాక్కవుతున్నారు. పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని గ్రామీణ ప్రాంతాలలో వాతావరణం ఎన్నికలవేళ పూర్తిగా మారింది. ఎవరు ఎటు సపోర్ట్ చేస్తారో. ఎవరు ఎవరి వెంట ఉంటారో అర్థం గానీ పరిస్థితి నెలకొంది.



# స్థానిక సంస్థ ఎన్నికలలో కాషాయం జండా ఎగరాలి..

**అన్ని స్థానాలలో పోటీకి సిద్ధం**

**మండల అధ్యక్షులు చల్లా నాగులు.**

**ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు**



**తల్లాడ /నవంబర్29 (జర్నలిస్ట్ వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలలో పోటీకి సిద్ధంగా ఉన్నామని తల్లాడ మండల అధ్యక్షుడు చల్ల నాగులు తెలిపారు. శనివారం అధ్యక్షుడు చల్ల నాగుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఖమ్మం పార్లమెంటు కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు హాజరై నాయకులకు దిశ నిర్దేశం చేశారు. రానున్న పంచాయతీ ఎన్నికలలో పంచాయతీ నుంచి బిజెపి పార్టీ ప్రతిష్టకు కావలసిన పనులు చేశారు. అధ్యక్షుడు చల్లా నాగులు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలలో బిజెపి పార్టీ ఎమ్మెల్యే స్థానాలలో పోటీకి సిద్ధంగా ఉందని, మండల ప్రజలు బిజెపి పార్టీ పట్ల సానుకూలంగా ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థలలో విజయం కోసం కృషి చేయాలని పార్టీ ప్రతిష్టకు మరింత సాయ సహకారాలు అందించి మండలంలో కాషాయం జెండా ఎగరాలని పంచాయతీలకు నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచే నిధులు వస్తాయని బిజెపి పార్టీని పంచాయతీలలో గెలిపిస్తే మరింత వేగవంతంగా అభివృద్ధి చెందుతాయాని తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గన్న మిత్రా జిల్లా కార్యదర్శి సురేందర్ రెడ్డి జిల్లా కౌన్సిల్ నెంబర్ గాదె కృష్ణారావు మండల ప్రధాన కార్యదర్శి రాయల రమేష్, పెరికకిరణ్ ఉపాధ్యక్షులు వేము రజిత మండల కార్యదర్శిగా చల్ల నరేష్ తమ్మిశెట్టి కృష్ణ మండల నాయకులు చౌడ నాగేశ్వరరావు కటిక నరసింహారావు మర్సకట్ల బాబురావు,సాయి కృష్ణ సంగీతం సాయి చందు గుండెల గురునాథ మండల నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుండి మండలంలో 11 సెంటర్ లలో అభ్యర్థుల నామినేషన్ పత్రాల స్వీకరణ.

**-జడ్పీ సీఈవో పురుషోత్తం.**



**బయ్యారం/నవంబర్ 29( జర్నలిస్ట్ వార్త):** మండలంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఆర్ఓ లకు,ఏ ఆర్ఓ లకు పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో దీపిక అధ్యక్షతన మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా జడ్పీ సీఈవో పురుషోత్తం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు రెండో విడత పోలింగ్ లో భాగంగా డిసెంబర్ 14న జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్,వార్డు మెంబెర్ల నామినేషన్ పత్రాలు నేటి నుండి డిసెంబర్ 2 తారీకు వరకు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని సిఈఓ తెలిపారు. మండల వ్యాప్తంగా పదకొండు గ్రామపంచాయతీలలో నామినేషన్ పత్రాలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. బయ్యారం గ్రామపంచాయతీకి సంబంధించిన ఒక సర్పంచ్,14 వార్డ్ మెంబర్లు నామినేషన్ పత్రాల స్వీకరణ బయ్యారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆర్ఓ స్వీకరిస్తారు. అదేవిధంగా గౌరారం జిపి కి సంబందించిన సర్పంచ్,10 వార్డ్ మెంబర్లు,గురిమెల్ల జిపి లో సర్పంచ్,8 వార్డ్ మెంబర్లు నామినేషన్ పత్రాలు గౌరారం పంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారు. ఇర్సులాపురం జిపిలో సర్పంచ్,10 వార్డ్ మెంబర్లు,కోట గడ్డ జిపి లో సర్పంచ్, 8 వార్డ్ మెంబర్లు నామినేషన్ పత్రాలు ఇస్లాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారు. కంబాలపల్లి జిపిలో సర్పంచ్,8 వార్డ్ మెంబర్లు,జగత్రావుపేట జిపి లో సర్పంచ్,8 వార్డ్ మెంబర్లు,నారాయణపురం జిపి లో సర్పంచ్, 6 వార్డు మెంబర్లు,అల్లిగూడెం జిపి లో సర్పంచ్,8 వార్డు మెంబర్లు నామినేషన్ పత్రాలను కంబాలపల్లి పంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారు. కొత్తగూడెం జిపి లో సర్పంచ్,8 వార్డు మెంబర్లు,కోయగూడెం జిపి లో సర్పంచ్,8 వార్డు మెంబర్లు,కస్తూరి నగరం జిపి లో సర్పంచ్,8 వార్డు మెంబర్లు,కాచనపల్లి జిపి లో సర్పంచ్,8 వార్డు మెంబర్లు కొత్తగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారు. కొత్తపేట గ్రామపంచాయతీలో సర్పంచ్,14 వార్డ్ మెంబర్ల నామినేషన్ పత్రాలు కొత్తపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారు. రామచంద్రాపురం జిపి లో సర్పంచ్,10 వార్డ్ మెంబర్లు, తిమ్మాపురం జిపి లో సర్పంచ్,8 వార్డు మెంబర్ల నామినేషన్ పత్రాలను రామచంద్రాపురం పంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారు. ఉప్పలపాడు జిపి లో సర్పంచ్,10 వార్డు మెంబర్లు,నర్సా తండా జిపి లో సర్పంచ్,8 వార్డు మెంబర్ల నామినేషన్ పత్రాలు ఉప్పలపాడు పంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారు. వెంకటాపురం జిపి లో సర్పంచ్,6 వార్డ్ మెంబర్లు,ఇసుకమేది జిపి లో సర్పంచ్,6 వార్డ్ మెంబర్లు,మిర్యాలపెంట జిపి లో సర్పంచ్,8 వార్డ్ మెంబర్ల నామినేషన్ పత్రాలను వెంకటాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారు. వెంకట్రాంపురం జిపి లో సర్పంచ్,10 వార్డ్ మెంబర్లు,బాలాజీ పేట జిపి లో సర్పంచ్,10 వార్డు మెంబర్లు,బాల్య తండా జిపి లో సర్పంచ్, 8 వార్డు మెంబర్లు,చర్లపల్లి జిపి లో సర్పంచ్,8 వార్డు మెంబర్ల నామినేషన్ పత్రాలను వెంకట్రాంపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారు. సంతలాల్ పోడు తండ జిపి లో సర్పంచ్,8 వార్డ్ మెంబర్ల,సింగారం జిపి లో సర్పంచ్,8 వార్డు మెంబర్ల,నామలపాడు జిపి లో సర్పంచ్,8 వార్డ్ మెంబర్ల,జగ్గు తండా జిపి లో సర్పంచ్, 10 వార్డ్ మెంబర్ల నామినేషన్ పత్రాలను బయ్యారం ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ పత్రాలు స్వీకరించనున్నట్టు అధికారులు తెలిపారు. మండలంలోని 29 గ్రామపంచాయతీ పరిధిలో 252 వార్డు మెంబర్లకు,29 సర్పంచులకు ఆయా సెంటర్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలు అందించాలని అభ్యర్థులను కోరారు. ఇతర వివరాల కోసం హెల్ప్ లైన్,కంట్రోల్ రూమ్ నెంబర్ నెంబర్ 91008171 08 ను సంప్రదించాలని జెడ్పి సీఈవో కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నాగరాజు, ఎంపీఓ చంద్రమోహన్,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల కు సిద్ధం అయిన పోలీసులు




**సత్తుపల్లి/నవంబర్29(జర్నలిస్ట్ వార్త):** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కల్లూరు డివిజన్‌లో పోలీసులు అప్రమత్తమయ్యారు. అల్లర్ల నియంత్రణకు సంబంధించి శనివారం విస్తృతంగా రయట్ కంట్రోల్ డ్రిల్లులు నిర్వహించారు. ఏసిపి వసుంధర యాదవ్ సూచనల మేరకు డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. స్టేషన్ల వారీగా ఎస్‌హెచ్‌ఓలు సిబ్బందిని సమీకరించి ఏర్పాట్లు పూర్తి చేశారు. డ్రిల్లులో భాగంగా షీల్డ్ ఫార్మేషన్‌లు, అడ్వాన్స్%-%రిట్రీట్ కదలికలు, లాఠీ హ్యాండ్లింగ్, జనం నియంత్రణ చర్యలు వంటి అంశాలను అధికారులు అభ్యసించారు. ప్రజా శాంతిభద్రతల పరిరక్షణలో బలగాల సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వేగం పెంపుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందని అధికారులు పేర్కొన్నారు. డ్రిల్లులను ఏసిపి వసుంధర యాదవ్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఎన్నికల డ్యూటీల్లో ఎలాంటి స్థితిగతులనైనా సమర్థవంతగా ఎదుర్కొనేలా సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు.

# కలిసొచ్చే పార్టీలతో కలసి స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పోటీ.



**దమ్మపేట/నవంబర్29(జర్నలిస్ట్ వార్త):** కలిసొచ్చే పార్టీలతో కలసి స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పోటీ చేస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయంలో దమ్మపేట మండల టీడీపీ అధ్యక్షుడు ఎండి వలీపాషా ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది,టిడిపి నాయకులు మాట్లాడుతూ గత పాలకులను గద్దె దించడానికి ప్రస్తుత ప్రభుత్వాన్ని ఏర్పాటుకు మన సహకారంతొ జరిగిందని తెలిసిన విషయమే. జిల్లా టిడిపి కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం ఆదేశంతో తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయాలని గ్రామ మండల నాయకత్వం మొత్తం శ్రమించి తమతో కలిసి వచ్చే పార్టీలతో గ్రామ నేతలు ఎవరికి వారు సమన్వయం కుదిరించుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలబడాలని దమ్మపేట టీడీపీ మండల అధ్యక్షుడు ఎండి వలీపాషా.పార్టీ కార్యదర్శి పల్లెల గాంధీ,సొసైటీ వైస్ చైర్మన్ కట్టం ఎర్రప్ప,తెలుగు రైతు అధ్యక్షులు గడ్డిపాటి సత్యనారాయణ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# నేడే ఉచిత వైద్య శిబిరం

**-వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి -హెల్త్ క్యాంప్ కోర్ కమిటీ సభ్యులు**



**వైరా/నవంబర్29(జర్నలిస్ట్ వార్త):** డాక్టర్స్ అసోసియేషన్ లయన్స్ క్లబ్ వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో నేడు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మెగా హెల్త్ క్యాంపు జయప్రదం చేయాలని వైరా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ దారెల్లి కోటయ్య అధ్యక్షతన జరిగిన క్యాంప్ కోర్ కమిటీ సభ్యులు సమావేశంలో డాక్టర్ కాప మురళీకృష్ణ డాక్టర్ నీలా సతీష్ కుమార్ తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంపు స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభిస్తారని తెలిపారు శారద నర్సింగ్ నందు జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మం ప్రశాంతి సూపర్ స్పెషాలిటీ వారి సౌజన్యంతో జరుగు ఈ హెల్త్ క్యాంపు ను తొమ్మిది విభాగాలుగా విభజించామని తెలిపారు. రిజిస్ట్రేషన్ కమిటీ డయాగ్నస్టిక్ కమిటీ ల్యాబ్ కమిటీ ఫార్మసీ కమిటీ ఫుడ్ కమిటీ ఏర్పాటు చేశామని విభజించిన విధంగా పేషెంట్స్ కు సేవలందించాలని వారు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు జరిగే ఈ హెల్త్ క్యాంప్ నందు హెచ్ బి డబ్ల్యు ఈసీజీ టు డి ఈ సి ఓ షుగర్ టెస్ట్ లు అన్ని ఉచితంగా నిర్వహిస్తారని వారు తెలిపారు. ఎనిమిది రకాల సేవలను ఈ హెల్త్ క్యాంప్ నందు ప్రజలకు అందిస్తామని కావున ఈ ఉచిత వైద్య శిబిరాన్ని పట్టణప్రజలందరూ వినియోగించుకోవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో హెల్త్ క్యాంపు కమిటీ సభ్యులు ఉంద్రు శ్యాంబాబు నూకల ప్రసాదరావు గజ్జల కృష్ణమూర్తి మాదినేని సునీత తోటకూర శ్రీకాంత్ చింతలపూడి వెంకటేశ్వరరావు చింతోజు నాగేశ్వరరావు డాక్టర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# ‘డిస్కవర్ ఆంధ్ర’ డాక్యుమెంటరీ

## సాయి దుర్గా తేజ్, నవదీప్ సారథ్యంలో డాక్యుమెంటరీ రూపకల్పన

**ప్రాజెక్టుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అటవీ శాఖ పూర్తి సహకారం**

**మన సంస్కృతి, ప్రకృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చిన సాయి తేజ్**




ఆంధ్రప్రదేశ్‌లోని అద్భుతమైన ప్రకృతి అందాలు, అటవీ సంపదను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో ‘డిస్కవర్ ఆంధ్ర’ అనే డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. శ్రీకాంత్ మన్నెపురి దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్టుకు సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్, యంగ్ హీరో నవదీప్ సారథ్యం వహిస్తున్నారు. ఏపీ అటవీ శాఖ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో రూపొందుతున్న ఈ డాక్యుమెంటరీ టైటిల్ గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేశారు.

ఈ సందర్భంగా సాయి దుర్గా తేజ్ మాట్లాడుతూ, మన సంస్కృతిని, ప్రకృతిని మనమే కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని పిలుపునిచ్చారు. “మన చుట్టూ ఇన్ని అద్భుతాలు ఉన్నాయా అని ఈ డాక్యుమెంటరీ చూస్తే తప్పక అనిపిస్తుంది. పర్యావరణ పరిరక్షణ కోసం 2020లో ‘గ్రీన్ పాస్’ అనే ఎన్జీవో ప్రారంభించాను. నా ‘రిపబ్లిక్’ సినిమాలో కూడా ఇదే అంశాన్ని చర్చించాం. ఈ డాక్యుమెంటరీకి మణిశర్మ మ్యూజిక్ అందించడం సంతోషంగా ఉంది. ఇలాంటి మంచి ప్రయత్నాలకు ప్రేక్షకులు, మీడియా మద్దతుగా నిలవాలి” అని కోరారు.

హీరో నవదీప్ మాట్లాడుతూ.. ఈ డాక్యుమెంటరీకి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారం ఎలా లభించిందో వివరించారు. “ఆంధ్రలోని వైల్డ్‌లైఫ్‌ను ప్రపంచానికి చూపించాలనే తన కోరికను సాయి తేజ్ నాతో పంచుకున్నారు. నేను వెంటనే ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకెళ్లాను. ఆయన తక్షణమే స్పందించి, ప్రాజెక్టుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించేలా చూశారు. 72 నిమిషాల నిడివితో శ్రీకాంత్ రూపొందించిన ఈ డాక్యుమెంటరీ చూసి మన రాష్ట్రంలో ఇన్ని అద్భుతాలు ఉన్నాయా అని అందరూ ఆశ్చర్యపోతారు” అని తెలిపారు.

పడాల సురేందర్ రెడ్డి, శ్రావ్య కూనం సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ డాక్యుమెంటరీ, ఏపీలోని అద్భుతమైన ప్రాంతాలను వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందుతోంది.

# ఆంధ్రా కింగ్ నువ్వే అనగానే టెన్షన్ పడ్డాను: ఉపేంద్ర



రామ్ పోతినేని కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం %-%ఆంధ్రా కింగ్ తాలూకా%-%. ఈనెల 28న విడుదలైన ఈ చిత్రం విమర్శకుల నుండి సానుకూల సమీక్షలను అందుకుంది. మహేష్ బాబు పి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శాండల్‌వుడ్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈరోజు హైదరాబాద్‌లో నిర్మాతలు విజయోత్సవ సభను నిర్వహించారు.సక్సెస్ మీట్ లో ఉపేంద్ర మాట్లాడుతూ.. తనపై తెలుగు ప్రజల అపారమైన ప్రేమాభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపేంద్ర మాట్లాడుతూ -%--%ఈ ఆఫర్ రాగానే థ్రిల్లయ్యాను. ఎందుకంటే ఇది బలమైన భావోద్వేగాలతో నిండి ఉంది. నాకు ఉన్న ఏకైక ఆందోళన టైటిల్ గురించి. నేను ఆంధ్రా కింగ్ అని మేకర్స్ అన్నారు. దానికి టెన్షన్ పడ్డాను. నేను %-%ఆంధ్రా కింగ్%-% ఎలా కాగలను? కానీ నేను వచ్చినప్పుడల్లా ఇక్కడి ప్రజలు నన్ను ముక్తకంఠంతో స్వాగతించారు, అందుకే నేను కింగ్‌లా ఫీలయ్యాను. తెలుగు ప్రేక్షకులు పెద్ద హృదయం కలిగి ఉన్నారు. గత 25 సంవత్సరాలుగా నాకు ఈ హృదయపూర్వక స్వాగతం లభిస్తున్నందుకు ఆనందంగా ఉన్నాను%--% అన్నారు.ఇలాంటి అవకాశం కల్పించిన మైత్రి మూవీ మేకర్స్ కు నేను నిజంగా కృతజ్ఞుడను అని ఉపేంద్ర అన్నారు. నా సహ నటులు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు. నా అభిమానులు సాగర్, మహాలక్ష్మి (రామ్-భాగ్యశ్రీ) లకు ఆయన బ్లెస్సింగ్స్ అందించారు. ప్రస్తుతం రామ్ , భాగ్యశ్రీ అమెరికాలో ఈ సినిమాను ప్రమోట్ చేస్తున్నారు.. కానీ నేను ఇక్కడే ఉన్నాను అని కూడా తెలిపారు. నిజానికి నేను స్టార్ ని కదా నన్ను యుఎస్ కి పంపాలి అంటూ సరదాగా జోక్ చేసారు ఉప్పీ.



# అనుకోకుండా వచ్చిన ఆఫర్..

## నా జీవితాన్నే మార్చేసింది: కృతి శెట్టి

‘ఉప్పెన’ చిత్రంతో తొలి సినిమాకే ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన నటి కృతి శెట్టి, తాను సినీ రంగంలోకి అనుకోకుండా ఎలా అడుగుపెట్టిందీ ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఒకప్పుడు వరుస ఆఫర్లతో దూసుకెళ్లిన ఆమె, ప్రస్తుతం ఫ్లాపులతో సతమతమవుతూ తమిళ చిత్రాలపై దృష్టి సారించారు.తన కెరీర్ ఆరంభం గురించి కృతి మాట్లాడుతూ... “నేనొక కమర్షియల్ యాడ్ ఆడిషన్ కోసం స్టూడియోకి వెళ్లాను. ఆడిషన్ తర్వాత నన్ను తీసుకెళ్లడానికి నాన్న రావాల్సి ఉండగా, ఆయనకు కాస్త ఆలస్యమైంది. ఆ ఖాళీ సమయంలో పక్కనే ఉన్న మరో స్టూడియోలోకి వెళ్లాను. అక్కడ ఒక సినిమా ఆడిషన్స్ జరుగుతున్నాయి. నన్ను చూసిన యూనిట్ సభ్యులు సినిమాల్లో నటిస్తావా? అని అడిగారు. ఏం చెప్పాలో తెలియక మా అమ్మ నంబర్ ఇచ్చి వచ్చేశాను. వాళ్లు అమ్మకు ఫోన్ చేసి ఆడిషన్‌కు పిలిచారు. అలా అనుకోకుండా నాకు ‘ఉప్పెన’ సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. అంతా ఓ కలలా జరిగిపోయింది” అని వివరించారు.‘ఉప్పెన’ బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత కృతి శెట్టికి అవకాశాలు వెల్లువెత్తాయి. నానితో ‘శ్యామ్ సింగ రాయ్’, నాగచైతన్యతో ‘బంగార్రాజు’ చిత్రాలు పర్వాలేదనిపించినా, ఆ తర్వాత వచ్చిన ‘ది వారియర్’, ‘మాచర్ల నియోజకవర్గం’, ‘కస్టడీ’, ‘మనమే’ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డాయి. దీంతో ఆమె కెరీర్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. ప్రస్తుతం కొంత గ్యాప్ తీసుకున్న కృతి, కోలీవుడ్‌లో రెండు ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ‘వా వాతియార్’, ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ అనే చిత్రాల్లో నటిస్తోంది. ఈ సినిమాలపై తమిళ పరిశ్రమలో మంచి అంచనాలున్నాయి. ఈ చిత్రాలతోనైనా కృతి శెట్టి తిరిగి విజయాల బాట పడుతుందేమోనని ఆమె అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వివరణ ఇచ్చినా కాజోల్ ను వదలని నెటిజన్లు...




బాలీవుడ్ నటి కాజోల్ వివాదంలో చిక్కుకున్నారు. ఓ టాక్ షోలో ఆమె పెళ్లి బంధంపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. పెళ్లికి కూడా ఎక్స్‌పైరీ డేట్ ఉండాలని, అవసరమైతే రెన్యూవల్ చేసుకునే ఆప్షన్ కూడా ఉంటే బాగుంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

వివరాల్లోకి వెళ్తే, ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫార్మ్ కోసం కాజోల్, ట్వింకిల్ ఖన్నా కలిసి ఓ చర్చా కార్యక్రమానికి హోస్టులుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ప్రసారమైన ఎపిసోడ్‌కు నటులు విక్కీ కౌశల్, కృతి సనన్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాజోల్.. “నచ్చని వారితో బలవంతంగా జీవించడం ఎందుకు? పెళ్లికి కూడా గడువు తేదీ ఉండాలి కదా” అని వ్యాఖ్యానించారు. దీనికి ట్వింకిల్ మద్దతు పలకగా, విక్కీ, కృతి మాత్రం ఈ అభిప్రాయాన్ని వ్యతిరేకించారు.ఈ వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు కాజోల్, ట్వింకిల్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. వివాహ బంధం విలువను తగ్గించేలా మాట్లాడటం సరికాదని, బాధ్యతగల స్థానంలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమాజంపై చెడు ప్రభావం చూపుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.విమర్శలు పెరగడంతో కాజోల్, ట్వింకిల్ స్పందించారు. షోలో సరదాగా జరిగిన సంభాషణను సీరియస్‌గా తీసుకోవద్దని కాజోల్ కోరారు. ఇది కేవలం హాస్యం కోసమేనని, మొదటి ఎపిసోడ్ నుంచే డిస్క్లైమర్ ఇస్తున్నామని ట్వింకిల్ వివరణ ఇచ్చారు. అయితే, వారి వివరణను కూడా నెటిజన్లు అంగీకరించడం లేదు. ముందు మాట్లాడి, తర్వాత సరదా అనడం సరికాదని, పబ్లిక్ ప్లాట్‌ఫార్మ్‌లపై మాట్లాడేటప్పుడు బాధ్యతగా ఉండాలని హితవు పలుకుతున్నారు.




# కార్తి అన్నగారు వస్తారు

## టీజర్.. ఎనర్జీ అదిరింది..!

కోలీవుడ్ స్టార్ కార్తి హీరోగా వస్తున్న కొత్త సినిమా టీజర్ రిలీజైంది. ఈ సినిమాకు తమిళ్ లో వా వాతియార్ అనే టైటిల్ పెట్టగా తెలుగులో అన్నగారు వస్తారు అనే పేరుని ఫిక్స్ చేశారు. నలన్ కుమారస్వామి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ వా వాతియార్ అదే అన్నగారు వస్తారు సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ లో కే.ఇ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. అన్నగారు వస్తారు సినిమాలో కార్తి సరసన కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తుంది. సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా టీజర్ ని ఒక సాంగ్ బిట్ రూపంలో రిలీజ్ చేశారు.సినిమాలో పోలీస్ గా నటిస్తున్న కార్తీ అలా కార్ దిగి రాగానే అతనికి వెల్కం చెబుతున్న సందర్భంలో వెనుక మ్యూజిక్.. కార్తి గ్రేస్ ఫుల్ స్టెప్స్ అబ్బా ఫ్యాన్స్ కి అయితే సూపర్ అనిపించేస్తుంది. ఇక మ్యూజిక్ వస్తూనే కార్తి డ్యాన్స్ చేస్తూనే మధ్య మధ్యలో సినిమా కాన్సెప్ట్ కి సంబంధించిన కొన్ని కట్ షాట్స్ వేశారు. ఫైనల్ గా మణిసార్ అనుకుంటూ కార్తి వెళ్తాడు. సో మరో క్రేజీ పోలీస్ స్టోరీతో కార్తి అన్నగారు వస్తారు సినిమాతో వస్తున్నారు.ఈ సినిమాలో కార్తి ఎనర్జిటిక్ గా కనిపించేలా ఉన్నారు. అఫ్కోర్స్ అన్ని సినిమాలకు ఆయన ఎనర్జీ అదిరిపోతుంది. కానీ పోలీస్ గెటప్ లో కార్తి హెయిర్ కట్, ఆయన స్టైల్ అంతా కొత్తగా ఉంది. అదే ఎనర్జీగా మారి స్క్రీన్ మీద అందంగా కనిపిస్తుంది. ఇక జస్ట్ టీజర్ తోనే సినిమా ఎలా ఉంటుందో శాంపిల్ చూపించారు మేకర్స్. తప్పకుండా అన్నగారు వస్తారు కార్తి ఫ్యాన్స్ కి ఒక మంచి మాస్ ఫీస్ట్ అందించేలా ఉందనిపిస్తుంది.

# అఖండ-2 టీజర్ కు అదిరిపోయే రెస్పాన్స్



నటసింహం నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కలయికలో రూపొందుతున్న భారీ చిత్రం ‘అఖండ 2’ నుంచి పవర్ఫుల్ టీజర్ విడుదలైంది. ‘అఖండ 2 మ్యాసివ్ తాండవం’ పేరుతో విడుదలైన ఈ టీజర్‌కు ప్రేక్షకుల నుంచి, ముఖ్యంగా అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సోషల్ మీడియాలో ఈ టీజర్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది.

“చెడు ఎక్కడ జరిగినా దేవుడు ఏదో ఒక రూపంలో ప్రత్యక్షమవుతాడు.. బీ బ్రేవ్” అంటూ బాలకృష్ణ తనదైన శైలిలో చెప్పిన డైలాగ్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. టీజర్‌లోని యాక్షన్ సన్నివేశాలు, విజువల్స్, నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను భారీగా పెంచాయి. గతంలో సంచలన విజయం సాధించిన ‘అఖండ’ చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది.

హైదరాబాద్‌లో చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా టీజర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. తాజా టీజర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు రెట్టింపు అయ్యాయి

# నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అల్లు అర్జున్ కూతురు అర్హ

## యంగెస్ట్ చెస్ ట్రైనర్‌గా నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గారాలపట్టి అల్లు అర్హ చిన్న వయసులోనే అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. యంగెస్ట్ చెస్ ట్రైనర్‌గా అసాధారణ ప్రతిభ కనబరిచి నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే, అల్లు అర్హ 30 చెస్ పజిల్స్‌ను పరిష్కరించడంలో ఏకంగా 50 మంది విద్యార్థులకు విజయవంతంగా శిక్షణ ఇచ్చింది. ఇంత చిన్న వయసులో ఆమె ప్రదర్శించిన ఈ నైపుణ్యానికి గుర్తింపుగా ఈ రికార్డు దక్కింది. అల్లు అర్జున్ తరచూ పంచుకునే క్యూట్ వీడియోలతో అర్హ ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితురాలైంది.గతంలో ‘శాకుంతలం’ సినిమాలో బాలనటిగా అరంగేట్రం చేసి తన నటనతో, స్పష్టమైన తెలుగు ఉచ్చారణతో ప్రేక్షకులను, విమర్శకులను ఆకట్టుకుంది. ఇప్పుడు చదువుతో పాటు చదరంగంలోనూ అద్భుత ప్రతిభ కనబరుస్తుండటంతో ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తండ్రికి తగ్గ కూతురని, అల్లు అర్జున్ స్ఫూర్తిని అర్హ కొనసాగిస్తోందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.